# నాకు నచ్చిన నా కథ

నా కలం పేరు లావణ్య. అసలు పేరు టి. సుబ్రమణ్యం. నేను రాసిన కథలలో నాకు బాగా నచ్చిన కథ, "ఇంతేలే! నిరుపేదల బ్రతుకులు!" ఈ కథ ప్రగతి సచిత్ర వారపత్రికలో 1-9-1972 లో ప్రచురితమై, పాఠకుల అభిమానాన్ని చూరగొని, నా కెంతో ఆనందాన్నిచ్చింది.



టి. సుబ్రమణ్యం

కథకు కాళ్లుండాలి. కాళ్లులేని కథ కంచికి అన్నారు. అందుకే నవల వ్రాయడంసులభం, కానీ కథ వ్రాయడం చాలాకష్టమని కొందరు అంటూవుంటారు. రచయిత హృదయాన్ని వో సంఘటన కదలించినప్పుడు, దాన్ని కాగితంమీద కథారూపంలో పెత్తే, అది కాళ్ళున్న కథనిపించుకొంటుందని, బలమైన కథా వస్తువున్న కథని కూడా ఖచ్చితంగా అనిపించుకుంటుంది. నా హృదయాన్ని కదిలించి, కథారూపంలో వెలువడిన ఈ కథంటే వల్లమాలిన ఇష్టం నాకు....

# ఇంతేలే! నిరుపేదల బ్రతుకులు

ఓ గుడిసెలో ఓ మూలకు కుక్కి నులకమంచంమీద ఈరిగాని తల్లి బాధతో మూల్గుతూ అస్థిపంజరంలా పడివుంది. ఆమె వారంరోజులనుండి గుండెనొప్పితో, పళ్ళు పటపటమని కొరుక్కుంటూ వుంది. కాళ్ళు, చేతులూ మంచానికేసి కొట్టుకుంటూ వుంది. ఈరిగాని పదవయేటనే తండ్రి కన్నుమూసాడు. తనకు తెలిసినప్పటినుండి తనీ లోకంలో చేయగల్గిన చివరి బ్రతుకుతెరువు చెప్పులు కుట్టుటయే గతి అయింది. బుద్ధి తెలియనంతవరకు ఎలాంటి కష్టంలేకుండానే యింతవరకు కాపాడుతూ వచ్చింది. తన తల్లి! అది మాత్రం ఈరిగాడికి బాగా గుర్తుంది- రోజూ ఆ ఇరానీ హోటల్ముందు కూలబడి,

'రండిసార్! రండి.'

రండిబాబు రండి! అని గొంతుచించుకోటం పొద్దు గూటిలోపడగా వచ్చిన ఆ మూడు రూపాయల చిల్లరపైసలు తీసుకొని ఇంటికి రావటం, దానితో కాలుతున్న కడుపుకు గంజిపోసి చల్లార్చుకోవటం! ఇలా జరిగిపోతుంది ఈరి బ్రతుకు.

* * *

ఆ రోజు తల్లికి ఇంజక్షన్ యిస్తూ డాక్టరు అన్నమాటలు ఈరిగాడికి గుర్తుకొచ్చి, నీరసంగా పడుకొనివున్న తల్లి దగ్గర చేరి,

'ఇదిగోనమ్మా! ఈ మందు తాగు! నేను పెందలకడనే వచ్చేస్తాను డాక్టరు చెప్పిపొయ్యిండు. ఈ మందు తాగితే, కాస్త తగ్గుతుందని' అని చెప్పి, తల్లినోట బలవంతంగా మందు తాగించేసి; పాత చెప్పులు చుట్టిన సంచిని భుజానవేసుకుని, తడిక ప్రక్కకు నెట్టి రోడ్డుమీద కొచ్చాడు. రోడ్డుమీద నడుస్తున్నాడు. నడుస్తున్న మాటేగానీ, మనసు మనసులో లేదు. తన నిరుపేద బ్రతుకును చూసి, ఏ మహారాజు 'అయ్యో! పాపం!' అని నాలుగుపైసలు దానంచేయబోతారు. బ్రతికినన్నాళ్ళు మనిషి ఎదుటి మనిషికి సాయంచేయాలన్న 'ధ్యాసే' లేదు. మట్టిపాలైన మనిషిని గురించి మాత్రం; వాడు చాలా మంచివాడు. ఉన్నన్నాళ్లూ మనిషిగా బ్రతికాడు అని వాపోతారు.

'ఛీ!ఛీ! ఏం బ్రతుకో.... యెదవ బ్రతుకు.' ఇరాని హోటల్ముందు చేరాడు ఈరిగాడు ఆలోచనల్తో. తిరిగి ఆలోచనల్లో పడ్డాడు. గతానికి స్వస్తిచెప్పి, 'ఎవరైనా బేరానికి వొస్తున్నారా?...' అని రోడ్డువైపు దృష్టిమరల్చాడు. రోడ్డంతా రదీగా వుంది. కార్లూ, లారీలూ, మోటారుసైకిల్లూ, టాక్సీలు, స్కూటర్లూ, బడి

పిల్లలు, రకరకాల మనుషులు, అందరూ వేగంగా పోతున్నారు.

'ఏయ్! ఈ చెప్పుకు ఉంగరం మాత్రం పెట్టి పాలీషు కొట్టు!' అన్నాడు వొక బుర్రమీసాల మనిషి ఈరిముందు చెప్పు పడేస్తూ.

'అట్టాగే దొరా!'

'ఏమి తీసుకుంటావు?'

'ఏదో మీ దయ దొరా!'

'ఏయ్ ఈ టక్కుటిక్కు మాటలు నా దగ్గర పనికిరావు '

'ఎంతో చెప్పోయ్!'

'ముప్పై పైసలే దొరా!'

'అఁ.... మంచిగా కుట్టవోయ్, ఇదిగో అయిదు నిముషాల్లో కుట్టేయాలి. నేను హోటల్లోకి వెళ్ళి యిప్పుడే వొచ్చేస్తాను.' అని బుర్రమీసాల మనిషి హోటల్లోకి దూరాడు. ఈరిగాడు ఆతురతగా, ఇదే మొదటి బోని...యింకా ఏదో గొణుక్కుంటూ, ఉంగరం పెట్టి పాలీష్ కొట్టేశాడు.

'ఏయ్! కుట్టేశావా?' అంటూ బుర్రమీసాల మనిషి ఈరిగాడి దగ్గరకొచ్చాడు హోటల్ నుండి.

'అప్పుడే అయింది దొరా!' అంటూ మీసాలతని చెప్పు లందించాడు.

'ఇదిగో పైసలంటూ' చిల్లర పైసలు ఈరిగాడికి అందించి వెళ్ళిపోయాడు, బుర్రమీసాల మనిషి తీసుకుని. ఈరిగాడు చిల్లర పైసలు లెక్క పెట్టుకుంటున్నాడు. ఇస్తానన్న పైసలు కంటే, తక్కువొచ్చి గబుక్కున మీసాలతన్ని చూశాడు. మీసాల మనిషి అప్పటికే మరుగయ్యాడు.

'ఛీ! ఛీ! ఏమిటో, ఈ మనుషుల నాలుక వొకటా, రెండా? ఇస్తానన్న పైసలకంటే అయిదు పైసలు తక్కువే యిచ్చి మెల్లగా జారుకుంటారు. నిలదీసి అడిగితే పదిరూపాయల నోటుకు చిల్లరుందా! అంటారు, మాలాటి పేదోళ్ళ దగ్గర లేవని తెలుసుకుని! మా కడుపులు కొట్టిపోతుంటారు.' ఎలాగైనా, ఆ రోజు ఎవరిముఖం చూశాడో గానీ, ఈరిగాడు ఐదు రూపాయలవరకు సంపాదించు కున్నాడు. పెందలకడ వొస్తానని తల్లికి చెప్పినమాట గుర్తొచ్చి అన్నీ సర్దుకుని బత్తాయిపండ్ల అంగడివైపు దారితీశాడు. అంగడి సేఠ్ సరుకులను సోకుగా అమర్చుకొంటున్నాడు. ఈరిగాడు గొంతు కాస్త హెచ్చించి.

'సేఠూ?! ఈ బత్తాయి పళ్ళెలాగా?' అన్నాడు.

'ఒక్కొక్కటి నలభై పైసలు.'

'ఏంటీ! ఇంత చిన్నవిగా వున్నాయ్. నలభై పైసలే? ఇక మాలాటి

పేదోళ్ళు పెద్దోళ్ళు అయినట్టే?' ఈరిగాడు గొణిగింది.

'ముప్పై పైసలకు యిస్తావా?'

'కానీ, మొదటి బోని నీదే! ఇప్పుడే అంగడి తెరచాను.' ఈరిగాడు నాలుగు బత్తాయిపండ్లు తీసుకున్నాడు. వేగంగా ఇంటికి నడుస్తున్నాడు. మొహంమీది చెమట తుడుచుకున్నాడు. జారిపోతున్న చెప్పులసంచిని తిరిగి సర్దుకున్నాడు. జారిపోతున్న నిక్కరును తిరిగి కట్టుకున్నాడు. తల్లి గుర్తుకొచ్చినప్పుడల్లా అతని ముఖంలో నిరాశాకిరణాలు ఆవరించేస్తున్నాయ్. పాలిపోయిన ముఖంతో గుడెసెలోకి దూరాడు.

* * *

ఆ రోజున నగరమంతా కాంతివిహీనమయివుంది. రద్దీగావుండే బజారంతా ప్రశాంతంగా ఉంది. దుకాణాలన్నీ మూసివేయబడి వున్నాయి. ఈరిగాడికి మాత్రం యిదంతా అయోమయంగా వుంది. ఏమిటో వాడికి అసలు విషయం తెలిసిందేకాదు.

'సారూ! ఎందుకేంటి బజారంతా మూసేసుకున్నారు.' అన్నాడు ఈరిగాడు భయంగా రోడ్డుప్రక్క నిలబడివున్న పోలీసుతో.

'ఛలో! ఛలో! కర్ఫ్యూ విధించారు. రోడ్డుమీదకు మనుషులు రాకూడదు. పట్టుకెళ్ళతారు' అనటంతో ఈరిగాని వీపు చరచినట్టయింది. రాత్రినుండి వాని తల్లికి గుండెనొప్పి ఎక్కువయింది. ఈ రోజు మందు తేవాలి సంపాదించిన పైసలతో.... దానికి వ్యతిరేకంగా ఈ రోజు ఎలగబడింది.' గొణుక్కుంటూ నిరాశతో గుడిసెలోకి వెళ్ళిపోయాడు. రాత్రి మొదటి ఝాములోకి అడుగు పెట్టింది. ఎంత ప్రయత్నించినా. ఈరిగానికి కునుకుపట్టటంలేదు. లేచి కూర్చున్నాడు. రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగేశాడు. తర్వాత, తడికె పక్కకునెట్టి బయట కొచ్చాడు. ఒక ఆలోచన తట్టింది, అదే.... తాజ్‌మహల్‌హోటల్ ప్రక్కన వున్న 'ఈశ్వరుని విగ్రహం' మీది గొలుసుమీద కన్నుపడింది.

ఈరిగాడు కళ్ళు నులుముకుని దృష్టిసారించి చీకట్లో చూశాడు. చీకటి మాయలా అలుముకుంది. ఈరిగాడు ధైర్యంచేసి గుడితలుపుల తాళం పట్టుకున్నాడు. జేబులోంచి ఇనుపపనిముట్లు తీసి తాళం తీయటానికి ఉపక్రమించాడు. తాళం వచ్చేసింది. తలుపు గడియతీసి లోనికెళ్ళి తలుపు మూసుకున్నాడు. దేవుడు నవ్వుతున్నాడు. ఎందుకు? దేవుని విగ్రహం ముందు దీపారాధన జ్ఞానజ్యోతిలా ప్రకాశిస్తున్నది.

'ఇ... హ్హి.... హి ....' విరగబడి ఈరిగాడు నవ్వుతున్నాడు.

'నువ్వు దేవుడివా! నేను ఇప్పుడు నిన్ను దొంగిలించుకుపోతున్నాను. నువ్వేం చేస్తావు? చెయ్యి! ఆ రోజు హిరణ్యకశిపుడు నరసింహస్వామి దగ్గిర చచ్చిపొయ్యేండు. ఆయన స్వర్గానికి పోయాడట! నేనూ అలాగే నీ దగ్గర చచ్చితే స్వర్గానికి పోతాను....' అంటూ విగ్రహం మెడలో ధైర్యంగా చెయ్యివేసి, గొలుసు నొలుసుకున్నాడు. మాటలురాని విగ్రహం విగ్రహంగానే వుండిపోయింది అంతే ఈరిగాడు ఇంటికి దాటేశాడు.

* * *

మర్నాడు ఉదయం గొలుసు అమ్మి డబ్బు తీసుకున్నాడు. 'ఈ రాత్రి ఫరవాలేదు. రేపు ఉదయం కాగానే ఈ మందు తెచ్చి యివ్వాలి' అంటూ డాక్టరు యిచ్చిపోయిన చీటీపట్టుకొని వేగంగా పరుగెత్తాడు ఈరిగాడు. 'మందుల కొట్టు.. మందుల కొట్టు ..!' అనుకుంటూ పరుగెత్తేసరికి: 'ఇదే మందుల షాపు!' కనిపించింది. పేదవాడికి పెన్నిధిలా కనిపించింది. పాపాత్ముడికి స్వర్గంలా కనుపించింది. వచ్చేపోయేవాళ్ళను పలకరిస్తున్నాడు కొట్టువాడు. జనం తరగటం లేదు మందులషాపులో. ఈరిగాని చీటి మడతలు విప్పి. కొట్టుమనిషి చదివి మందు అందిచ్చాడు ఈరిగాని చేతికి. మందు పైసలు చెల్లించి మందు తీసుకుని రివ్వున పరుగెత్తుతున్నాడు ఈరిగాడు. వాడి కాళ్ళు తేలిపోతున్నాయి. మందు చేతిలో జాగ్రత్తగా వుంచుకుని రోడ్డు దాటాడు. పరుగుపరుగున పరుగెడుతూ తన గుడిసె కనిపించింది. గుడిసె సమీపంలోని మనుషులు కనిపించారు. ధనికులు కనిపించారు. గుడిసె ముందుకొచ్చి-

'అమ్మా!' అని కేక పెట్టాడు.

సమాధానం లేదు. తడికె తోసుకొని లోపలి కెళ్ళాడు. చీకటి కడుపులో కాంతి మసగమసగ్గా కనబడుతోంది. గుడ్డిగా వెలుగుతున్న కిరోసిన్ దీపాన్ని పెద్దచేసి తల్లివంక చూశాడు. తల్లి మామూలుగా కదలకుండా పడుకుని వుంది.

'అమ్మా! మందు తెచ్చానే....'

కంఠం జీరపోయింది. తల్లిని కదిపాడు ఈరిగాడు. కదల్లేదు. తర్వాత ఈరిగాడు నిజం తెలుసుకొని బావురుమన్నాడు. గుడిసె ప్రక్కన పోతున్న 'బాటసారి' చేతిలోని ట్రాన్సిస్టర్ పాడుతోంది. 'ఇంతేలే, నిరుపేదల బ్రతుకులు అవి యేనాటికి పనికిరాని అతుకులు' అని.

ఈరిగాడి రెండు చెంపలపై నుంచి మాత్రం కన్నీటి చుక్కలు భారంగా క్రిందకు జారిపోయాయ్.

---